భారత్ సమాచార్.నెట్
BHARATH SAMACHAR DIGITAL

17, సెప్టెంబర్ 2026, గురువారం భారత్ సమాచార్

ప్రజా సంక్షేమానికి పాటుపడాలి: వేముల వీరేశం



భారత్ సమాచార్, నిర్మల్ జిల్లా: ప్రభుత్వ పథకాలను ప్రజాక్షేత్రంలో విజయవంతంగా అమలు చేస్తూ సకల వర్గాల సంక్షేమానికి పాటుపడాలని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం నిర్మల్ కలెక్టరేట్‌లో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. అంతకుముందు పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం జాతీయ గేయం, జాతీయ గీతం, తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించారు.




ఈ సందర్భంగా జిల్లాలో వివిధ శాఖల ద్వారా అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలను ప్రభుత్వ విప్ వేముల వీరేశం వివరించారు. ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను అధికారులు సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా క్షేత్రస్థాయిలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.



ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండే పరిపాలన అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ తెలిపారు. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో

పనిచేస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలనను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలని పేర్కొన్నారు.



ఈ సందర్భంగా ఉద్యానవన పంటల అభివృద్ధికి కృషి చేసిన మండల వ్యవసాయ అధికారులను ప్రభుత్వ విప్ అభినందించారు. వారి సేవలను గుర్తిస్తూ ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ప్రదర్శనలను అధికారులు, ప్రజాప్రతినిధులు ఆసక్తిగా తిలకించారు.



అనంతరం మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో లబ్ధిదారు పుట్ట సుమన్‌కు మంజూరైన ఎలక్ట్రిక్ ట్రాలీ ఆటోను ప్రభుత్వ విప్ వేముల వీరేశం, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, అధికారులు కలిసి అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారునికి ప్రభుత్వ సహకారం అందించడం పట్ల అధికారులు వివరాలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డీఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే, డీఆర్వో రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

© 2026 Bharath Samachar